క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



కార్మికుడికి దుస్తులు పంపిణీ చేస్తున్న రాధారాణి

శిరివెళ్ల: యర్రగుంట్ల పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి సతీమణి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు సత్తార్ రాధారాణి దుస్తుల పంపిణీ చేశారు. రంజాన్, ఉగాది పర్వదినాలను పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. పండుగలు సంతోషంగా చేసుకోవాలని సూచించారు.

ఉపాధి సిబ్బంది బదిలీ

శిరివెళ్ల: ఉపాధి పథకం సిబ్బంది బదిలీ అయ్యాయరని ఏపీఓ రామసుబ్బయ్య గురువారం తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఉమామహేశ్వరి పాణ్యంకు, సుబ్బరాయుడు, లక్ష్మీప్రసన్న నంద్యాలకు, శివలింగమయ్య బండి ఆత్మకూరుకు బదిలీయయ్యారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు నరసింహరాజు నంద్యాలకు, హసీనా పర్వీన్ రుద్రవరానికి లాంగ్ స్టాండింగ్‌పై బదిలీ అయినట్లు తెలిపారు.

పరామర్శ



రామసుబ్బారెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న శిల్పారవి

నంద్యాల(అర్బన్): మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వరపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి తండ్రి రామసుబ్బారెడ్డి బ్రెయిన్ స్ట్రోక్‌తో అశ్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్ రెడ్డి రామసుబ్బారెడ్డి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలంటూ.. జాగ్రత్తలు తీసుకుంటే త్వరగా కోలుకోవచ్చని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ సురేష్‌బాబు

చాగలమర్రి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన రమేష్‌రెడ్డిని అవినీతి ఆరోపణలతో జిల్లా పోలీసు ఉన్నత అధికారులు చిత్తూరు జిల్లాకు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో నంద్యాలలో పని చేస్తున్న ఎస్‌ఐ సురేషను నియమించడంతో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డిలను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

వైద్య శిబిరానికి స్పందన



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాది సయ్యద్ అమీర్‌బాషా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతుల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. మహిళలు, మహిళా న్యాయదులు, కోర్ట్ సిబ్బంది 40 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్, మయోగ్రామ్, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ హసీనా, జగదీష్, గిరితేజ పాల్గొన్నారు.

మద్దతు ధరకు పేర్లు నమోదు చేసుకోండి

దొర్నిపాడు: పంట దిగుబడులను మద్దతు ధరతో విక్రయించుకోవాలంటే రైతులు తప్పని సరిగా రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కందులు క్వింటా రూ.7,550, శనగలు రూ.5,650, పెసలు రూ.8,682, మినుములు రూ.7,400 మద్దతు ధరతో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఆధార్, పొలం, బ్యాంక్ పాసు పుస్తకాలతో గ్రామ వ్యవసాయ సహాయకులను కలవాలని సూచించారు.

నేషనల్ సైన్స్ టాలెంట్ టెస్టులో ప్రతిభ



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో ఉన్న గురురాజ స్కూల్ విద్యార్థులు నేషనల్ సైన్స్ టాలెంట్ టెస్టులో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 26వ తేదీ నిర్వహించిన సైన్స్ టాలెంట్‌లో 6, 7, 8, 9 తరగతులకు చెందిన 13 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. బ్రెయిన్ బ్రాక్స్ ఫౌండేషన్ ద్వారా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోనే ఈ ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందజేసినట్లు తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై

ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

● జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

నంద్యాల: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సహకరించి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో మాదకద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, డీఆర్‌ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లోని విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కాలేజీలో మాదకద్రవ్యాల నియంత్రణకు కళాశాల సిబ్బంది పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యాక్టరీలలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు పనిచేస్తున్నారని, గంజాయి ఇతర మాదకద్రవ్యాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. ఫ్యాక్టరీల యజమానులు తనిఖీలు నిర్వహించేలా చూడాలన్నారు. మెడికల్ దుకాణాల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నిద్ర మాత్రలను విక్రయించరాదని తెలపారు. మిర్చి సాగులో గంజాయి పండించే ప్రమాదం ఉందని.. వీటిని అరికట్టేందుకు వ్యవసాయ, ఉద్యానవనాధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు పాల్గొన్నారు.

అత్యాచార బాధితులకు సత్వర న్యాయం అందించండి

ఎస్సీ, ఎస్టీలు, అణగారిన వర్గాల ప్రజలపై దాడులు, అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు, డీఆర్‌ఓ రాము నాయక్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ..ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 18 కేసులు నమోదయ్యాయని తెలిపారు. కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు కేసుల వివరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. 2022 ఏప్రిల్ 4వ తేదీ నుంచి 2024 డిసెంబర్ వరకు 272 కేసులు ఎఫ్ఐఆర్ నమోదుకాగా 440 మంది బాధితులకు రూ.5.82 కోట్లను పంపిణీ చేశామన్నారు. అలాగే జనవరి 2025 నుంచి మార్చి 20వ తేదీ వరకు 27 కేసులు నమోదు కాగా 59 మంది బాధితులకు రూ.10.61లక్షలు పంపిణీ చేశామని తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ ఖాళీల వివరాలను తెప్పించుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణికి సూచించారు. నంద్యాలలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సఫాయి కర్మచారుల జీతభత్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపాలిటీ, ఆస్పత్రులు, దేవాలయాల్లో సఫాయి కర్మచారులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులను దాదాపుగా క్లియర్ చేశామని ఏఎస్పీ యుగంధర్ తెలిపారు. కమిటీ సభ్యులు బాలనాగన్న, నాగరాజు, కాశన్న, దేవదానం, రవికాంత్ బాబు, రమేష్ నాయక్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

శిరివెళ్ల: గంగవరానికి చెందిన వివాహిత దూదేకుల రజనీ అదృశ్యమైందని ఎస్‌ఐ చిన్న పీరయ్య గురువారం తెలిపారు. ఈనెల 25న ఇంటిలో ఎవ్వరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. భర్త మదార్‌వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శిరివెళ్ల: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి సూచించారు. గురువారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పొగాకు, మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీల శిక్షణ



మాట్లాడుతున్న సీడీపీఓ చంద్రకళ

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులకు అందించే విద్య పిల్లలకు మంచి పునాదిలాంటిదని ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ అన్నారు. స్థానిక నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో అర్బన్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోషణ్‌బీ-పడాయ్‌బీ శిక్షణా కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ నవచేతన జీరో నుంచి 3 ఏళ్ల వారి ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రాలతో పాటు చిన్నారుల్లోని నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హేమలత, సుజాత, జయలక్ష్మి, నజీర, తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించాలి



స్కౌట్ విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రుద్రవరం:విద్యార్థుల్లో దేశ భక్తి పెంపొందించేందుకు స్కౌట్స్, గైడ్స్ ఎంతగానో దోహద పడుతుందని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో గురువారం 8, 9, 10 తరగతుల విద్యార్థులతో స్కౌట్, గైడ్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అనురాధ విన్యాసాలు చేయించారు. వాటిని తిలకించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గొప్ప సేవా దృక్పథంతో ముందుకు సాగే స్కౌట్, గైడ్స్ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. విద్యార్థుల్లో దేశ భక్తితో పాటు సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం కిరణ్‌కుమార్, సుధాకర్‌బాబు, ఖలీల్, చవాన్, విజయలక్ష్మి, ఇశాక్, రమణ, లలిత, జ్యోతిప్రియ ఉన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థి కిడ్నాప్ కలకలం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని కారులో కొందరు పోలీసులమని చెప్పి కిడ్నాప్ చేసిన సంఘటన కలకలం రేపింది. కర్నూలు జిల్లా నాగులాపురం గ్రామానికి చెందిన ఉమేష్‌చంద్ర స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. కళాశాలకు దగ్గరలో ఉన్న దేవనగర్ బీసీ హాస్టల్‌లో వసతి పొందుతున్నాడు. మధ్యాహ్నం హాస్టల్ నుంచి బయటకు వచ్చిన ఉమేష్‌చంద్ర వద్దకు కొందరు కారులో వచ్చి పోలీసులమని చెప్పి బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. అతని పక్కనే ఉన్న స్నేహితుడు హాస్టల్‌వార్డెన్‌కు విషయం తెలియజేయడంతో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని లక్ష్మీదేవికి సమాచారం అందించారు. లక్ష్మీదేవి హుటాహుటిన స్థానిక టూటౌన్ పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశా. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా కారు నంబర్‌ను గుర్తించి ఓనర్‌కు కాల్ చేశారు. అయితే విద్యార్థిని తీసుకెళ్లింది పోలీసులేనని.. కర్నూలు తాలుక పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి ప్రేమవ్యవహారంపై ఫిర్యాదు అందడంతో అక్కడి పోలీసులు నంద్యాలకు వచ్చి తీసుకెళ్లినట్లు లక్ష్మీదేవి తెలిపారు. పోలీసుల అత్యుత్సాహం కారణంగా ఆందోళన చెందామని విద్యార్థులు వాపోయారు.

పాస్టర్ మృతికి కొవ్వొత్తులతో సంతాపం



గాంధీచౌక్ వద్ద కొవ్వొత్తులతో సంతాపం

నంద్యాల(న్యూటౌన్): రాజమండ్రిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని నంద్యాలలో క్రైస్తవులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పెద్ద చర్చి సెంటర్ ఆవరణలో క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా క్రిష్టియన్ సెల్ అధ్యక్షుడు సుందర్‌రాజు, ఉపాధ్యక్షుడు విజయానంద్, దళిత క్రిస్టియన్ నాయకులు ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రవీణ్ మరణంపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గాంధీ చౌక్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఆ సంఘం నాయకులు పుల్లా నరసింహులు, మన్నెం జానయ్య, ఏసురత్నం పాల్గొన్నారు.

కోలుకోలేక టోల్‌ప్లాజా ఉద్యోగి మృతి

● బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి ఉద్యోగుల ధర్నా



చాగలమర్రి టోల్ ప్లాజా ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

చాగలమర్రి: స్థానిక టోల్‌ప్లాజా టోల్ కలెక్టర్ మొహమ్మద్ విధి నిర్వహణలో తీవ్ర అస్వస్థతకు గురి కాగా తిరుపతికి తరలించి వైద్యం చేయింగా 40 రోజులపాటు మృత్యువుతో పోరాడి కోలుకోలేక గురువారం మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని తోటి ఉద్యోగులు టోల్ ప్లాజా వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ రెస్ట్ లేకుండా విధులు నిర్వహించడంతోనే మొహమ్మద్ మెదడులో రక్తం గడ్డకట్టి స్పృహతప్పి పడిపోయాడాన్నారు. చికిత్స చేయించినా లాభం లేకపోయిందన్నారు. 70 మంది ఉద్యోగులు ఉండగా టోల్‌ప్లాజా వెండర్ జీఐ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఏ ఒక్కరికి కూడా ఇన్సురెన్స్ చేయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పలుమార్లు అడిగినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రతి రోజు టోల్ ప్లాజా ద్వారా రూ.16 లక్షలు వసూలవున్నా ఉద్యోగుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన మొహమ్మద్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మహమ్మద్ కుటుంబాన్ని ఆదుకుంటాం

● మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి



మహమ్మద్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

చాగలమర్రి: టోల్ ప్లాజాలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ కోలుకోలేక మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నేత షేక్ బాబులాల్ సమీప బంధువు మహమ్మద్(37) కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం ఆయన చాగలమర్రిలో మొహమ్మద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వ్యాపారవేత్తలు చక్రం ముల్లా షబ్బీర్ అహమ్మద్, షేక్ నాయబ్‌రసూల్, బి.ఖాజాహుసేన్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, వి.మాబుషరీఫ్, ఎం.ఖాదర్‌బాషా, ఫయాజ్, మాబుసున్న, అబ్దుల్లా, లూర్థయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఆకతాయికి ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీలక్ష్మీ జైలు శిక్షను ఖరారు చేసినట్లు కోర్టు సిబ్బంది, పోలీసులు గురువారం తెలిపారు. వివరాలు.. తిమ్మాపురం గ్రామానికి చెందిన నిమ్మకాయల శ్రీకాంత్ దారిన వెళ్లే మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించేవాడు. సైగలు చేస్తూ తీవ్ర పదజాలంతో దూషించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా జడ్జి విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో ఏడు రోజుల జైలు శిక్షను ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేద ఆర్యవైశ్యులకు ఉగాది కానుకల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): ఉగాది పండుగను పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాలలో పేద ఆర్యవైశ్య కుటుంబాలకు గురువారం ఉగాది కానుకలను జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు భవనాసి వాసు, భవనాశి నాగమహేష్ అందజేశారు. అందరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో భవనాశి వెంకటసుబ్బయ్య శెట్టి, వెంకమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో 500 మందికి రూ.15 లక్షల విలువ చేసే కిట్లను అందజేశామన్నారు. సంఘం నాయకులు ఖండే శ్యాంసుందరలాల్, పువ్వాడ భాస్కర్, మామిళ్ల నాగరాజు, విజయశేఖర్, చంద్రశేఖర్, ఉపేంద్ర పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలుకు వినతి

నంద్యాల(అర్బన్): జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. జొన్న రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం సమితి నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతి పత్రం ఇచ్చారు. అన్ని ప్రాంతాల్లో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు మూడు వారాలు అవుతున్నా కొనుగోలు చేయలేదన్నారు. ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచుకోవడంతో అకాల వర్షాలతో ఇబ్బందులు ఎదురవుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గడిగరేవుల సర్పంచ్ హరినాథరెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, దశరథ రామిరెడ్డి, పాణ్యం, గడివేముల, గోస్పాడు మండలాల రైతులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

ఆళ్లగడ్డ: రజకుల సామాజికాభివృద్ధికి ప్రభుత్వాలు జీఓలు విడుదల చేస్తున్నా అమలుకు నోచుకోవడం లేదని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన రజకులకు ఎస్సీ రిజర్వేషన్, 250 యూనిట్లు ఉచిత విద్యుత్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు లింగమ్మ, అమడాల రమణ ఉన్నారు.

జాబ్‌మేళాలో 19 మందికి ఉద్యోగాలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 32 మంది విద్యార్థులు హాజరయ్యారు. డ్రైవ్ కంపెనీ ప్రతినిధి ఇంటర్వ్యూల ద్వారా 19 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, జేకేసీ కో ఆర్డినేటర్ పార్వతి, గురువయ్య, మహబూబ్‌బాషా, ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజా, అధ్యాపకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ల సీజ్



సీజ్ చేస్తున్న వాటర్ ప్లాంట్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలో మూడు మినరల్ వాటర్ ప్లాంట్లు సీజ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గురువారం సంజీవనగర్‌లో ఉన్న సాయిరాం మినరల్ వాటర్, ఎన్‌జీఓ కాలనీలో ఉన్న వాటర్ ప్లాంట్లను సీజ్ చేసినట్లు కమిషనర్ చెప్పారు. ప్లాంట్లలో ప్రమాణాలకు అనుగుణంగా నీటి పరీక్షలు చేపట్టామని తెలిపారు. మినరల్ వాటర్ ప్లాంటులో సమస్య ఉన్నందు వల్ల మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్యాబ్రో మైక్రోబయాలజిస్ట్ ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంట్ ఆదేశాల మేరకు సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగితే చర్యలు తప్పవన్నారు. మరికొన్ని వాటర్ ప్లాంట్లు తనిఖీ చేయగా మెయింటనెన్స్ మరమ్మతులు చేయించుకుని పురపాలక సిబ్బంది ద్వారా ల్యాబ్‌లో పరీక్షలు చేసి మెరుగైన ఫలితాలు వచ్చిన యెడల యథావిధిగా ప్లాంటు నడుపుకోవాలని ఆదేశించారు.

ఎండను అధిగమిస్తూ...ఘాటును భరిస్తూ!



మండుటెండలో క్రిష్టిపాడులో మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

దొర్నిపాడు: ఓ వైపు భగభగమంటున్న భానుడు.. మరోవైపు మిర్చి ఘాటు.. అవేమీ పట్టించుకోకుండా మహిళలు తలకు గుడ్డ చుట్టుకుని మండుటెండను అధిగమిస్తూ ఘాటును భరిస్తూ మిర్చి గ్రేడింగ్ పనులు చేస్తున్నారు. చూసేవారంతా ఎలా తట్టుకుంటున్నారు తల్లీ అంటున్నారు. మండలంలో చాకరాజువేములు, దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల గ్రామాల్లో ఒకవైపు మర్చికోతలు..మరోవైపు మిర్చి గేడింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

ముగిసిన వేలంపాటలు



వేలంపాటలను నిర్వహిస్తున్న అధికారులు

చాగలమర్రి: స్థానిక మేజర్ పంచాయతీకి గురువారం వేలం పాటలు ముగిశాయి. గత ఏడాది కంటే రూ.6 లక్షల ఆదాయం ఎక్కువగా వచ్చిందని డీఎల్‌పీఓ రాంబాబు, ఇన్‌చార్జ్ ఈఓ తాహెర్‌హుసేన్ తెలిపారు. బస్టాండ్ రూ.10.50 లక్షలు, వారపు సంత రూ.2.62 లక్షలకు నాయబ్‌సా దక్కించుకున్నారన్నారు. కమేలా రూ.1.20 లక్షలకు ఇమాంహుసేన్, దిన మార్కెట్ రూ.1.21 లక్షలకు రామచంద్రుడు వేలంపాట దక్కించుకున్నారన్నారు. గతేడాది వేలంపాటల్లో పాటదారుల మధ్య జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్‌ఐ అబ్దుల్‌నబీ తమ సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

పంచాయతీ వేలంలో తగ్గిన ఆదాయం

రుద్రవరం: స్థానిక మార్కెట్ వేలాల్లో మేజర్ పంచాయతీకి గతేడాది కంటే ఈ ఏడాది రూ.3,000 ఆదాయం తగ్గింది. దిన, సంత, కబేలా మార్కెట్లకు గురువారం సర్పంచు బైరి విజయలక్ష్మి, డీఎల్‌పీఓ రాంబాబు ఆధ్వర్యంలో ఈఓ సుబ్బారావు వేలం పాటలు నిర్వహించారు. డిపాజిట్లు చెల్లించిన 11 మంది కాంట్రాక్టర్లు పాల్గొని వేలం పాడారు. సంత మార్కెట్‌ను రూ.8.05 లక్షలు, దిన మార్కెట్ రూ.4.65 లక్షల చొప్పున రెండింటిని మబ్బు లక్ష్మీనరసింహుడు, కమేలా మార్కెట్‌ను రూ. 9వేలకు చౌడయ్యదక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. గతేడాది రూ.12.82 లక్షలు రాగా ఈ ఏడాది రూ.12.79 లక్షలు వచ్చిందన్నారు. ఎలాంటి గొడవలు తలెత్తకుండా శిరివెళ్ల ఎస్‌ఐ పీరయ్య యాదవ్, రుద్రవరం ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి





రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి, కిట్లను అందజేస్తున్న జేసీ విష్ణుచరణ్

బొమ్మలసత్రం: రంజాన్ పర్వదినాన్ని ప్రతి ముస్లిం సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్‌లను పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో పవిత్రతతో ఉపవాసాలు కొనసాగిస్తున్నారని.. వారి కుటుంబాలను అల్లాహ్ దీవించాలన్నారు. పార్టీనాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, దేవనగర్‌బాషా పాల్గొన్నారు.

రంజాన్ తోఫా కిట్ల పంపిణీ

నంద్యాల (వ్యవసాయం): ఆల్ మైనారిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో జేసీ విష్ణుచరణ్ చేతులమీదుగా పేద ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఆల్ మేవాలోని వివిధ డిపార్ట్‌మెంట్లకు చెందిన ప్రభుత్వ మైనారిటీ ఉద్యోగులు, నిరుపేద ముస్లింలకు సహాయం చేయడాన్ని అభినందించారు. ఆల్‌మేవా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అబులైజ్ మాట్లాడుతూ.. ముస్లిం ఉద్యోగుల నుంచి క్లౌడ్ ఫండింగ్ ద్వారా సేకరించిన రూ.2,27,200తో 421 మందికి ఈ రంజాన్ తోఫాను పంపిణీ చేశామన్నారు.

ఈకేవైసీ గడువు పొడిగించాలి

నంద్యాల(న్యూటౌన్): రేషన్‌కార్డులను కుదించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈకేవైసీ అంటూ హడావుడి చేస్తోందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. డీలర్ల దగ్గర వేలిముద్రలతో ఈకేవైసీ ఈనెల 31లోపు చేయించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉండడంతో లబ్ధిదారులందరూ తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కొంత మంది ఉపాధి, చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారని, ఈకేవైసీ చేయించుకునేందుకు జూన్ చివరి వరకు గడువు ఇవ్వాలని కోరారు.ప్రజాపంపిణీ వ్యవస్థలో బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.